క్లుప్తంగా

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మంచాల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం చేపట్టిన 100రోజుల్లోనే హామీలు నెరవేరుస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఏడాది గడిచినా ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేక పోతున్నారని విమర్శించారు. వసతిగృహాల్లో కలుషిత ఆహారం తిని ఆస్పత్రుల పాలైన విద్యార్థులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రజాసమస్యలపై ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేయడం తప్ప, ఈ ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ చేయడం లేదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు విష్ణు వర్ధన్‌రెడ్డి, నాయకులు రవి, రఘుపతి, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు సమష్టి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

యాచారం: ఇంధన పొదుపు అందరి బాధ్యతని ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ సురేష్‌రెడ్డి అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగిస్తున్న ఇంధనంలో సింహభాగం బొగ్గు, ముడి చమురులేనని, పొదుపుపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సంబంధిత పుస్తకాలు అందజేశారు.

ప్రజారోగ్యమే ట్రస్ట్ లక్ష్యం

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఉప్పల, రాధాకృష్ణ, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్టులు నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయని గంప లక్ష్మయ్య, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధి ఎక్వాయిపల్లిలో మూడు ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రి వైద్య బృందం సౌజన్యంతో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయగా.. వారు ప్రారంభించారు. వైద్యులు అఖిల్, అనిల్, భావన ఆధ్వర్యంలో 333 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. సింగిల్‌విండో డైరెక్టర్ వీరయ్య, నాయకులు ముత్యాలు, భిక్షపతి, చంద్రయ్య, సాయిలు, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలకు విద్యార్థులు



క్రీడా దుస్తులతో విద్యార్థులు

ఆమనగల్లు: సరూర్‌నగర్‌లో నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు తలకొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం వెళ్లారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింహ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సత్యం, స్థానిక నాయకులు గణేశ్, శ్రీశైలం, సురేశ్, పురుషోత్తం, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇళ్ల సర్వే

ఆమనగల్లు: ఇందిరమ్మ ఇళ్ల సర్వే మున్సిపాలిటీలో జోరుగా సాగుతోంది. సంకటోనిపల్లి గ్రామంలో నిర్వహించిన సర్వేలో మున్సిపల్ కమిషనర్ వసంత, కౌన్సిలర్ కమటం రాధమ్మ, మున్సిపల్ అధికారి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు. మండల పరిధి మంగళపల్లి గ్రామంలో సర్వేను ఎంపీడీఓ కుసుమమాధురి పర్యవేక్షించారు.

బీజేపీ బూత్ కమిటీల ఎన్నిక

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి బీజేపీ శ్రేణులు ప్రజలకు వివరించాలని ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్యలు అన్నారు. పట్టణంలోని 178వ బూత్ కమిటీని శ్రీకాంత్‌సింగ్, రాంపాల్‌నాయక్, దుర్గయ్యల సమక్షంలో శుక్రవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా అశోక్‌యాదవ్, కార్యదర్శిగా వెంకటేశ్, మీడియా కన్వీనర్‌గా బంటి, బూత్ లెవెల్ ఏజెంట్లుగా వినయ్‌లను నియమించారు. అనంతరం కమిటీ సభ్యులను సత్కరించారు.

చీపునుంతలలో..

బీజేపీ తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామ 23వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా రమేశ్, గౌరవ అధ్యక్షుడిగా బాలస్వామి, ప్రధాన కార్యదర్శిగా దశరథ్‌లను పార్టీ మండల అధ్యక్షుడు రవిగౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

కొత్త పంచాయతీలు



రాయిపోల్ గ్రామపంచాయతీ కార్యాలయం

- నివేదికలు సమర్పించిన అధికారులు
- పట్నంలో పెరగనున్న గ్రామాలు
- నూతనంగా ఎన్గల్‌గూడ, రాయపోల్‌లో నగభాగం
- మండలంలో 16కు చేరనున్న సంఖ్య
- అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు!

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలో కొత్త గ్రామాలు పెరగనున్నాయి. వీటి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సంబంధిత అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దగా.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ అనుబంధ గ్రామాలను నూతన పంచాయతీలుగా గుర్తించనుంది. ఇప్పటికే అసెంబ్లీలో నూతన పంచాయతీరాజ్ చట్టం బిల్లు సవరణకు పెట్టారు. కొత్త గ్రామాల ఏర్పాటు అనంతరం ప్రభుత్వం.. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

500 ఓటర్లకు ఎక్కువగా ఉంటే..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 500 ఓటర్లకు ఎక్కువగా ఉన్న అనుబంధ గ్రామాలు, తండాలతో పాటు, గ్రామాలకు కిలో మీటరు అంతకంటే ఎక్కువ దూరం ఉండి ఒకే పంచాయతీ కింద ఉన్న వాటిని సైతం గుర్తించారు. మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి అనుబంధంగా ఉన్న బుగ్గతండా, యాచారంలో కుర్మిద్దతండా, మర్లకుంటతండా, మాడ్గుల మండలంలోని పెద్దమాడ్గుల, దిలావర్‌ఖాన్‌పల్లిలు కొత్త గ్రామాలుగా ఏర్పాటు కానున్నట్లు సమాచారం. ఇబ్రహీంపట్నం మండలంలో ఇప్పటికే 14 గ్రామాలు ఉండగా.. కొత్తగా రెండు గ్రామాల ఏర్పాటుతో ఆ సంఖ్య 16కు చేరనుంది. మండలంలో దండుమైలారం, పోల్కంపల్లి, నాగన్‌పల్లి, రాయపోల్, ముకునూర్, నెర్రపల్లి, చర్లపటేల్‌గూడ, తుర్కగూడ, కప్పపహాడ్, ఎల్మినేడు, పోచారం, ఉప్పరిగూడ, తులేకలాన్, కర్ణంగూడ గ్రామాలు ఉన్నాయి. పోల్కంపల్లి గ్రామానికి అనుబంధంగా మన్నెగూడ, జాజోనిబావి, ఎన్గల్‌గూడ జీపీలు ఉన్నాయి.

మూడు ప్రాంతాలను కలిపి..

అనుబంధ గ్రామం ఎన్గల్‌గూడలో 605 మంది జనాభా ఉండటంతో గ్రామం ఏర్పాటుకు అర్హత సాధించింది. రాయపోల్‌కు మూడు అనుబంధ జీపీలు ఉన్నాయి. వీటిలో దొండగూడ, మందగూడ, సూర్యోదయనగర్ మూడు అనుబంధ గ్రామాలను కలిపి కొత్త పంచాయతీ ఏర్పాటు కానుంది. వీటిల్లో 848 మంది జనాభా ఉండగా.. ఈ మూడు అనుబంధ గ్రామాలను కలిపి సూర్యోదయనగర్ కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయనున్నారు. ఇదిలా ఉండగా.. కొత్త పంచాయతీల ఏర్పాటు నేపథ్యంలో కలెక్టర్.. ఎంపీడీఓల నుంచి సంబంధిత నివేదికలు కోరగా.. పట్నం మండలంలోని ఎన్గల్‌గూడ, సూర్యోదయనగర్ గ్రామాల పూర్తి స్థాయి సమగ్ర నివేదికలను కలెక్టర్‌తో పాటు పంచాయతీరాజ్ అధికారులకు రెండు రోజుల క్రితం అందజేశారు. ఇవే కాకుండా నియోజకవర్గంలోని మంచాల, యాచారం, మాడ్గుల మండలాల అధికారులు నివేదికలు సమర్పించారు.

నివేదికలు పంపాము



కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటులో భాగంగా అర్హతకలిగిన ప్రాంతాల పేర్లతో కూడిన సమగ్ర సమాచార నివేదికను కలెక్టర్‌కు అందజేశాం. పోల్కంపల్లిలోని ఎన్గల్‌గూడ, రాయపోల్‌లోని మందగూడ, దొండగూడ, సూర్యోదయనగర్‌లను కలిపి కొత్త పంచాయతీ ఏర్పాటు చేయనున్నారు.

– వెంకటమ్మ, ఎంపీడీఓ ఇబ్రహీంపట్నం



పెద్ద చెరువు వద్ద చదును చేసి వదిలేసిన మల్టీపర్పస్ క్రీడా ప్రాంగణం

నిర్వహణ లోపం.. అలంకార ప్రాయం

- బోసిపోతున్న క్రీడా ప్రాంగణాలు
- 16 ప్రాంతాల్లో స్థలాల ఎంపిక.. రెండు చోట్ల పనులు
- మల్టీపర్పస్ మైదానం.. ప్రహరీతో సరి

మీర్‌పేట: గ్రామీణ ప్రాంత యువతను ఆటల్లో ప్రోత్సహించేందుకు గ్రామానికో క్రీడామైదానం అంటూ రెండేళ్ల క్రితం నాటి ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా అధికారులు జిల్లెలగూడ, మీర్‌పేట ప్రాంతాల్లో మొత్తం 16 చోట్ల మైదానాల ఏర్పాటుకు స్థలాలను ఎంపిక చేశారు. తొలినాళ్లలో హడావుడి చేసినప్పటికీ.. ఆ తరువాత ప్రాంగణాల పనులు, నిర్వహణ గురించి ఎవరూ పట్టించుకోకవడం లేదు. ఫలితంగా అవి అలంకార ప్రాయంగా మిగిలాయి.

రూ.2 కోట్లతో మల్టీపర్పస్

మీర్‌పేట పెద్ద చెరువు వద్ద ఒకే చోట అన్ని రకాల ఆటలకు సంబంధించి మల్టీపర్పస్ ప్రాంగణాన్ని ఏర్పాటు చేసేందుకు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. స్థలాన్ని చదును చేసి చుట్టూ ప్రహరి(ఇనుప కంచె), రెండు వైపులా గేటు అమర్చి ఏడాది పూర్తయినా.. ఇప్పటివరకు ఎలాంటి పనులు చేపట్టలేదు.

షెటిల్ కోర్టుతో..

16 చోట్ల స్థలాలు ఎంపిక చేసి, జిల్లెలగూడ రాఘవేంద్రకాలనీలో కేవలం షెటిల్ కోర్టు, పెద్ద చెరువు వద్ద ప్రహరి నిర్మించి అధికారులు చేతులు దులుపుకొన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మల్టీపర్పస్ ప్రాంగణంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్‌తో పాటు పలు రకాల క్రీడల కోసం ప్రత్యేకంగా కోర్టులను నిర్మిస్తామని చెప్పిన అధికారులు.. రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఏ ఒక్కటి ఏర్పాటు చేయలేక పోతున్నారని క్రీడాకారులు పేర్కొంటున్నారు. మీర్‌పేటతో పాటు పరిసర ప్రాంతాల యువతకు అందుబాటులో ఉండే పెద్ద చెరువు వద్ద క్రీడా ప్రాంగణంలో త్వరిత గతిన పనులు చేపట్టి, వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

'ఆటోవాలాలపై పగపట్టిన ప్రభుత్వం'



పోలీసుల అదుపులో జేఏసీ నేతలు

ఇబ్రహీంపట్నం: పేద వర్గాలైన ఆటోవాలాలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పగబట్టిందని ఆటో యూనియన్ జేఏసీ చైర్మన్ మడుపు వేణుగోపాల్ రావు ఆరోపించారు. ఆటో కార్మికుల చలో అసెంబ్లీ నేపథ్యంలో శుక్రవారం యూనియన్ నేతలను స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్న వారి పట్ల సర్కార్ వైఖరి సరైందికాదన్నారు. అవుటర్ రింగ్ రోడ్డు అవతలి వరకే ఆటోలు నడపడం అనే అంశాన్ని ప్రభుత్వం వెనక్కుతీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.12 వేలు అందించాలని, ఫిట్‌నెస్, టాక్స్ బీమా సౌకర్యాలను ప్రభుత్వమే ఉచితంగా కల్పించాలని కోరారు. రాయితీలపై ఆటోలను అందించాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో జేఏసీ నాయకులు సద్గుణ చారి, రాములు, శ్రీనివాస్, వినోద్, రవి, యాదయ్య, రవిందర్, రాజు, కృష్ణలు ఉన్నారు.

పల్లెప్రగతితో తెలంగాణ గ్రామాలు దేశానికే ఆదర్శం

కడ్తాల్: పల్లెప్రగతితో తెలంగాణ గ్రామాలు అభివృద్ధి చెంది, దేశానికే ఆదర్శంగా నిలిచాయని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం రాజేందర్‌నగర్ జాతీయ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థలో రెండు రోజుల నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో బీహార్‌కు చెందిన స్థానిక సంస్థల ప్రతినిధుల(సర్పంచ్)తో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత పంచాయతీ పాలకవర్గంలో పల్లెప్రగతి ద్వారా చేపట్టిన పారిశుద్ధ్య నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్లు, పల్లె ప్రకృతి వనం, ఇంకుడు గుంతలు, తడిపొడి చెత్త వేరు చేయుట, రైతు వేదికలు, వైకుంఠధామాల నిర్మాణం, జీపీ ఆదాయ వనరుల పెంపు తదితర అంశాలపై వివరించారు. సమావేశంలో ప్రొఫెసర్ అరుణ్‌రాజ్, బీహార్ పంచాయతీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాలకు రైతులు

ఆమనగల్లు: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకలకు తలకొండపల్లి మండలం నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తరలివెళ్లారు. ఇందులో భాగంగా నిర్వహించే కిసాన్ మేళాలో కర్షకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములు, నాయకులు విష్ణుగౌడ్, రేణురెడ్డి, నాగేశ్, శ్రీనివాసులు, రాము, కృష్ణయ్య, రైతులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి పడిపూజ



గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి పూజ చేస్తున్న దీక్షాపరులు

యాచారం: అయ్యప్ప నామస్మరణతో శుక్రవారం మండల కేంద్రం మార్మోగింది. ధర్మశాస్త్ర సేవా సమితి సన్నిధానంలోని అయ్యప్ప మాలధారులు ఇరుముడి పడి పూజ నిర్వహించారు. గురుస్వామి చందర్‌నాయర్ పర్యవేక్షణలో నారాయణశెట్టి, పురుషోత్తం, బాషల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టగా.. మాలధారులతో పాటు అనేక మంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తుల భక్తిగీతాలు అలరించాయి. గురుస్వామి ఆధ్వర్యంలో సన్నిధానం నుంచి ఆంజనేయస్వామి దేవాలయం వరకు అయ్యప్పదీక్షా పరులతో పాటు వారి కుటుంబ సభ్యులు భారీ ర్యాలీ తీశారు. అనంతరం భక్తులకు బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు బాష అన్నదానం చేశారు.

విద్యతోనే సమాజ ప్రగతి



సీసీ కెమెరాల ఏర్పాటుకు పాఠశాల సిబ్బందికి విరాళం అందజేస్తున్న దాత

మాడ్గుల: విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి అన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. మండల పరిధి కొల్కులపల్లి గ్రామంలో శుక్రవారం ఉన్నత పాఠశాలకు సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆయన కుమార్తె గోదారెడ్డి రూ.40 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతోనే భవిష్యత్ ఉందని, శ్రద్ధగా చదువుకొని అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులు కావాలని విద్యార్థులకు సూచించారు.

గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు



గవర్నర్ జిష్ణుదేవ్‌తో చిన్నారులు, క్లబ్ సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధి బాటసింగారం జ్యోతిరావు పూలే బీసీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు ఇంటర్ సెకండియర్ విద్యార్థి శశికుమార్ గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అంతరిక్ష పరిశోధనలపై ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్ పలువురు విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. వీరిని శ్రీహరి కోటకు తీసుకెళ్లనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా చైర్మన్ శాంతమూర్తి, రీజినల్ కో ఆర్డినేటర్ జయప్రకాష్‌లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల అరెస్టు

మాడ్గుల: ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంతో నష్టపోతున్నామని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం.. పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సర్కారు తీరుకు నిరసనగా ఆటో జేఏసీ శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో నగరానికి వెళ్తున్న డ్రైవర్లను పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఇమాం సాహెబ్, శ్రీనివాస్, షరీఫ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్సర కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆమనగల్లు: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తూ అనుమానస్పదంగా మృతిచెందిన అప్సర కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్ ఒక ప్రకటనలో కోరారు. అప్సర కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు అభినందనలు



గురునాథ్‌రెడ్డిని సన్మానించిన సంఘం నేతలు

ఇబ్రహీంపట్నం: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, డైరెక్టర్ మహేశ్‌గౌడ్‌లను శుక్రవారం స్థానిక నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువ కప్పి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్, ఉపాధ్యక్షులు శ్రీను, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి ప్రవీణ్, అశోక్, భాస్కర్, జగదీశ్, శేఖర్, యాదగిరి, రాజు, సురేష్, సురేందర్ పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా నర్సింహ



యాచారం: సీపీఎం మండల కార్యదర్శిగా నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన ఆలంపల్లి నర్సింహ వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ 8వ మండల మహాసభలో చేపట్టిన ఎన్నికకు మండల కార్యదర్శిగా 24 మంది పోటీ పడ్డారు. పార్టీ అధినాయకత్వం తప్పని పరిస్థితిలో రాత్రి ఓటింగ్ నిర్వహించగా.. మండల పరిధి గ్రామాల నుంచి ఓటింగ్ అర్హత కలిగిన వంద మంది డెలిగెట్స్ పాల్గొన్నారు. వారిలో అత్యధికులు నర్సింహకే మద్దతు పలికారు. దీంతో ఆయన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ, జిల్లా కార్యదర్శి భాస్కర్, జిల్లా నేతలు యాదయ్య, మధుసూదన్ రెడ్డి, సామెల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

'అమిత్‌షా'పై ఆగ్రహ జ్వాల

- అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళనలు
- దేశ ప్రజలకు షా క్షమాపణ చెప్పాలంటూ ప్రజాసంఘాల డిమాండ్
- కేంద్రమంత్రి దిష్టిబొమ్మ దహనం



ఇబ్రహీంపట్నం: షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

ఆమనగల్లు/ఇబ్రహీంపట్నం/మంచాల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై కేంద్రం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నారు. ప్రజాసంఘాలు ఆందోళన బాట పడుతున్నాయి. ఎక్కడికక్కడ నిరసనలు తెలుపుతూ.. షా దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నాయి. షా మాటలను వెనక్కి తీసుకోవాలని, దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆయా నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఆమనగల్లులో..

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అంబేడ్కర్, పూలే జ్ఞాన జాతర వ్యవస్థాపకుడు సుధాకర్, సీపీఎం ఏరియా కమిటీ కన్వీనర్ కానుగుల వెంకటయ్యలు డిమాండ్ చేశారు. షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలన్నారు. షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై రాజీవ్ కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. షా దిష్టి బొమ్మను దహనం చేశారు. దళిత, ప్రజాసంఘాల నాయకులు దామోదర్, సాయిలు, యాదయ్య, చెన్నయ్య, శివశంకర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

పార్లమెంటులో అంబేడ్కర్‌ను అవమాన పరిచేలా మాట్లాడిన అమిత్ షాను తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని సీఐటీయూ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్యదర్శి చింతపట్ల ఎల్లేశ్ డిమాండ్ చేశారు. షా అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా.. పట్నం అంబేడ్కర్ కూడలిలో షా దిష్టిబొమ్మను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అంబేడ్కర్ పేరును ఉచ్చరిస్తే బీజేపీ ఎందుకు జంకుతుందని ప్రశ్నించారు. అట్టడుగు వర్గాలకు హక్కులు కల్పించిన అంబేడ్కర్‌ను విదేశాలు కీర్తిస్తుంటే.. స్వదేశి పాలకులు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. సీఐటీయూ నాయకులు బుగ్గరాములు, ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, శ్రీకాత్, రాఘవేందర్, రైతు సంఘం నాయకులు ముసలయ్య, బీసీడబ్ల్యూ నాయకులు దశరథ, కేవీపీఎస్ నాయకులు వీరేష్, దాసు, యాదగిరిలు పాల్గొన్నారు.

మంచాలలో..

అంబేడ్కర్‌ను అవమాన పరిచే విధంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. పార్టీ మండల కార్యదర్శి జంగయ్య, మండల నాయకులు బుగ్గరాములు, స్వామి, గోపాల్ తదితరులు ఉన్నారు.

టాస్క్ సీఓఓకు నాయకుల సన్మానం



రాఘవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిని నగరంలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వేదాద్రి లక్ష్మీ నర్సింహాస్వామి దేవాలయ అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ ద్వారా సహకరించాలని సుంకిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంబాజీ, నాయకులు అంజయ్యగౌడ్, అజీజ్, అశోక్‌బాబు, రాజు పాల్గొన్నారు.



ఆమనగల్లు: నిరసన వ్యక్తంచేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



మంచాలలో.. సీపీఎం నాయకులు